అందుకే ఓరోజు అర్ధరాత్రి దుర్గాదాసుతో వచ్చి పోలిథిన్ గుళికల్ని కరిగించి పేపర్ క్రింద మార్చే యంత్రాన్ని విరగ్గొంటించాడు. దాంతో ఫ్యాక్టరీకి లాకౌట్ ప్రకటించి పరమశివం ఇన్సూరెన్స్ అధికారులకు తెలియజేశాడు నష్టపరిహారం ఇప్పించాలంటూ. మరుసటిరోజే ఇన్సూరెన్స్ అధికారులు చెకింగ్‌కి వచ్చిన యంత్రం పాడయిన విధానం తమకు అనుమానం కలిగించిదంటూ నష్టపరిహారం ఇచ్చేందుకు అభ్యంతరం తెలిపారు.

దాంతో పరమశివానికి అనుమానం వచ్చింది. కావాలని యంత్రాన్ని ఎవరు పాడుచేస్తారు? ఎవరికా అవసరం వుంది ? వినయంగా తలవంచుకుని పనిచేసుకుపోయేవర్కర్స్ కి అ అవసరం లేదు, మరి...

ఇదే అనుమానాన్ని ఓ రోజు దిగాలుగా తన భార్య బిడ్డల ముందు అనేశాడు పరమశివం

"ఫ్యాక్టరీమీద తమ బ్రతుకుల్ని వెళ్ళబుచ్చుకుంటున్న బీద కార్మికులకి ఆ యంత్రాన్ని నాశనం చేయాలనే ఆలోచనే రాదు. పైగా వాళ్ళేం తీరని కోర్కెలతో మీమీద నిరసన కూడా ప్రకటించలేదు. అలాంటప్పుడు ఆ పని చేసింది వాళ్ళు కాదనిపిస్తోంది. మరెవరు..?" పరమశివం భార్య సాలోచనగా అంది.

"కాస్తో కూస్తో లాభాలు కూడా వస్తున్నాయ్. అలాంటప్పుడు ఏ యజమానీ యంత్రాన్ని కావాలని పాడు చేసుకోడు" పరమశివం అన్నాడు తన సైడ్ నుంచి.

"కాస్తో కూస్తో చాలదని ఇంకెక్కువ కావాలని ఎవరన్నా ఆ పని చేసారనుకోటానికి ఏమయినా వీలుందా?" ఆమె మరలా అంది.

అప్పుడు చప్పున మధుమూర్తి గుర్తుకొచ్చాడు పరమశివానికి "ఆ యంత్రం దానంతటదే సాంకేతిక కారణంగా పాడయితేనే ఇన్సూరెన్స్ వాళ్ళు నష్టపరిహారం యిస్తారు. ఆ విషయం అందరికి తెలుసు కనుక ఇన్సూరెన్స్ సైడ్ లాభం ఆశించి ఆ పనిచేసి వుండరు"?

"యంత్రం పాడయితే ఏమవుతుంది నాన్నా?"

అప్పటివరకూ అక్కడే వుండి తల్లి దండ్రుల మధ్య నడిచే సంభాషణను శ్రద్ధగా వింటున్న పరమశివం కూతురు ప్రశ్నించింది.

"ఫ్యాక్టరీ మూతపడుతుందమ్మా!"

"మూతబడితే?" తిరిగి ప్రశ్నించింది కూతురు.

"ఫ్యాక్టరీకి తాళాలు వేసుకోవలసిందే" అన్నాడు విసురుగా పరమశివం.

"అలా చేస్తే లాభం వస్తుందా నాన్నా?" పరమశివం పదేళ్ళకొడుకు ఉదయ్ అడిగాడు. అక్కను చూసి తనకూ ఏదో అడగాలనిపించి.

కొడుకు ప్రశ్నతో ఉలిక్కిపడ్డాడు. ఆ ప్రశ్నలో ఏదో మర్మం దాగుంది.

కొడుకు తెలియక ఆ ప్రశ్న వేసినా, దాని జవాబుని రాబట్టగలిగితే అసలు విషయం బయటపడిపోతుంది.

అంతే....

పరమశివం చటుక్కున లేచి యిప్పుడే వస్తానంటూ ఫ్యాక్టరీకి సాగిపోయాడు ఆ అర్థరాత్రి చీకట్లోనే.

కేవలం కుతూహలంకొద్దీ పడుకుంటున్నట్లే నటించి తండ్రిని అనుసరించసాగాడు ఉదయ్.

పరమశివం అరగంటలో ఫ్యాక్టరీకి చేరుకున్నాడు. నిశ్శబ్దంలో ఫ్యాక్టరీ చిమ్నీ నిర్జీవంగా కనిపిస్తోంది. అది పొగలు చిమ్మితేనే తమ పొట్టలు గడిచేది. శ్మశానం నడిబొడ్డున మోడు వారిన చెట్టులా కనిపిస్తున్న చిమ్నీ వేపే చూస్తూ గేటు వైపు సాగిపోయాడు.

గేటుదగ్గర ఎప్పుడూ వుండే వాచ్‌మెన్ లేడు, అతని స్థానంలో ఓ కొత్త వ్యక్తి దృఢంగా తుమ్మమొద్దులా వున్నాడు.

ఈ మార్పు ఎప్పుడు జరిగింది?

అంటే తన నోటీసుకు రాకుండానే ఫ్యాక్టరీలో చాలా మార్పులు జరుగుతున్నాయన్నమాట.

పరమశివం ఓక్షణం ఉలిక్కిపడ్డాడు. తన పాత్రని కావాలనే తన భాగస్తులు రోజురోజుకి తగ్గిస్తూ వస్తున్నారా?

"ఎవరది?"

దుర్గాదాస్ గొంతు ఖంగుమంది. పరమశివం అప్పుడు గుర్తుపట్టాడు. అతను దుర్గాదాస్ అని- పట్టాభికి కుడిభుజమని.

పరమశివంలో భయాందోళనలు చోటుచేసుకున్నాయి "నేనే..." అన్నాడు మాములుగానే.

"మీరా సార్... ఏమిటి ఈ టైంలో యిలా వచ్చారు?" ఒకింత విసురుగానే అన్నాడు.

అతని ప్రవర్తనలో పరమశివం కూడా తన యజమానేనన్న భావం ఏ కోశానా కనిపించలేదు.

అతను దుర్గాదాసు గొంతులో తొంగిచూసిన కర్కశత్వాన్ని చప్పున గ్రహించి మాట మార్చేశాడు "సాయంత్రం ఇంటికెళుతూ నా కాష్ బాగ్‌ని ప్యాక్టరీలో మర్చిపోయాను. అందులో డబ్బుండిపోయింది. రేపు తెల్లవారుజామునే ఊరికెళ్ళాల్సి వుంది, దాన్ని తీసుకెళ్దామని వచ్చాను. బై ది బై! జాగ్రత్తగా కాపలా కాస్తున్నావు కదా?" కృత్రిమమైన ప్రసన్నతను మొఖంమీదకు తెచ్చుకున్నాడు అతను.

దుర్గాదాస్‌కు ఎలాంటి అనుమానం రాలేదు "వెళ్ళి తెచ్చుకోండి సార్" అన్నాడు గేటు తెరుస్తూ.

ఓసారి గుండెనిండా ఊపిరి తీసుకుని బిల్డింగ్ వేపు సాగిపోయాడు అతను.

బిల్డింగ్‌కి దగ్గరవుతుండగానే ఏదో వెగటు కలిగించే వాసన ఘాటుగా వచ్చి తగిలింది. ఆ వాసన దేనికి సంబంధించినదో అర్థంగాక ఓక్షణం అనుమానించి తన గదిలోకి వెళ్ళి లైట్ వేసి కిటికిలోంచి ఓసారి గేట్‌వేపు చూశాడు. దుర్గాదాస్ తాపీగా సిగరెట్ వెలిగించుకుని కూర్చుని కనిపించాడు.

అంతే...

చప్పున వేనుదిరిగి ఫ్యాక్టరీ వెనుకవేపు భాగానికి దూసుకు పోయాడు. వెళ్తుండగానే మరింత ఘాటయిన వాసన వచ్చింది.

క్రమంగా అతనిలో అనుమానం బలపడసాగింది. సరిగ్గా పదినిమిషాల్లో తను తిరిగి గేటుదగ్గరకు వెళ్ళక పోతే దుర్గాదాస్‌కు అనుమానం రావచ్చు.

అతని నడకలో వేగం పెరిగింది. అంతా గాఢాంధకారం.

క్రింద ఎత్తుగా పెరిగిన గడ్డి- పరిసరాలు స్పష్టంగా కనిపించడం లేదు. అయినా మొండిగా ముందుకు సాగిపోయాడు. ఫ్యాక్టరీ బిల్డింగ్ పైన వెలుగుతున్న కాంతి అస్పష్టంగా ఆ ప్రాంతంలో పరుచుకుంది.

వడివడిగా నడుస్తున్న పరమశివం హటాత్తుగా ఆగిపోయాడు. ఆ ప్రాంతమంతా చదునుగా వుంది. కొంచెం ఎత్తులో ఏవో మొక్కలు పెరుగుతున్నాయి వరుసక్రమంలో, అప్పటికి అతను శంకిచాడు.

అలాంటి ప్రదేశంలో చేయగలిగే తప్పుడు పని గంజాయి మొక్కలు పెంచటం అని.

చటుక్కున వంగి మొక్కల చివర వున్న రెండు కాయల్ని కోసి జేబులో వేసుకున్నాడు. పనిలో పనిగా ఆ మొక్కల ఆకుల్ని కూడా తెంపి వేగంగా వెనుతిరిగాడు.

నడకలో వేగం పెంచుతూనే వాచీవేపు చూసుకున్నాడు. అప్పటికి తను ఫ్యాక్టరీలోకి ఎంటర్ అయి ఆరునిమిషాలయింది. రిలాక్స్‌గా ఫీలవుతూ తన గదిలోకి వెళ్ళి చటుక్కున లైట్ ఆర్పేసి బయటకొచ్చేశాడు.

గేటు దగ్గరవుతుండగా పరమశివానికి ఓ క్షణం భయం వేసింది.

"పర్స్ తీసుకున్నారా సార్?" దుర్గాదాస్ కంఠంలో చిత్రమైన మార్పు.

పరమశివం లిప్త పాటు ఉలిక్కిపడి వెంటనే తేరుకున్నాడు.

"ఆ...ఆ..." అన్నాడు అక్కడినుండి త్వరగా వెళ్ళిపోవటం మంచిదనే ఉద్దేశ్యంతో.

"సరే వెళ్ళి రండి కానీ..." దుర్గాదాస్ హఠాత్తుగా నవ్వాడు. పరమశివం కంగారుపడ్డాడు.

"అది మీరూహించినట్లు గంజాయే... ఇంటికెళ్ళి దీపం వెలుగులో పెట్టి నిర్ధారించుకోనక్కరలేదు. ఇకపోతే ఆ పంట మీఇంట సిరుల పంట. మరో నాలుగు రోజుల్లో అది కాపుకు వస్తుంది. ఆల్‌రెడి కాయలకు గీతలు పెట్టేశాం. పాలు కారటం ప్రారంభమైంది. ఇంకో నాలుగురోజులు ఈ రహస్యాన్ని మీలోనే దిగమింగుకుంటే యిలాంటి ఫ్యాక్టరీలు నాలుగు కట్టొచ్చు... లేదంటే.." అంత సేపు దుర్గాదాస్ చాలా తాపీగానే మాట్లాడాడు.

"ఓరి దౌర్భాగ్యుల్లారా! ఇలాంటి తప్పుడుపని చేస్తారని కల్లోకూడా ఊహించలేదు. ఇందుకేనా మెషిన్‌ని విరగ్గొట్టింది! ఈ తప్పుడు పనిని నేను సహించలేను. తక్షణం ఆ పంటను తగలెట్టకపోతే చాలావరకు వెళ్ళాల్సివస్తుందని పట్టాభికి, మధుమూర్తికి చెప్పు" కోపంతో వూగిపోతూ ఆన్నాడు పరమశివం.

“ఆ....ఆ... అలా ఆవేశపడిపోకండి మరి. ఇది మీ ఫ్యాక్టరీ. మీకు తెలియకుండానే గంజాయి పెరిగిందా? అని ఎక్సైజ్ వాళ్ళు అడుగుతారు. న్యాయస్థానంవాళ్ళు పధ్నాలుగేండ్లు రాజమండ్రికి ఆతిధిగా పంపిస్తారు. బుద్దిగా నోరు మూసుకుంటే....కళ్ళు కూడా మూసుకుంటే నా చెయ్యి బొడ్లోకి వెళ్ళదు.

నా సంగతి మీకు తెలుసనుకుంటాను. అసలే నా చెయ్యి బహుచెడ్డది. మర్యాదగా మీ దగ్గరున్న గంజాయి కాయల్ని యిలా యిచ్చి ఆలా వెళ్ళిపోండి” అంటూ దూకుడుగా ఒకడుగు ముందుకు వేశాడు దుర్గాదాస్ .

అతని గురించి, అతని రాక్షసత్వం గురిమచి పరమశివానికి బాగానే తెలుసు, పళ్ళు పటపట కొరుకుతూ జేబులో దాచిన కాయల్ని తీసి దుర్గాదాస్ పైకి విసిరేసి చీకట్లో కల్సిపోయాడు.

దుర్గాదాసుకు, తన తండ్రికి జరిగిన సంభాషణంతా ఉదయ్ ఓపొదచాటు నుండి విన్నాడు.

ఏదో తప్పు పని పట్టాభి అంకుల్, మధుమూర్తి అంకుల్ చేశారు. తన తండ్రి మంచివాడు. చెడ్డపనులంటే కోపం, తను చేయడు అమ్మని, అక్కని తన్ను కూడా చేయనివ్వడు.

ఊరంతా తన తండ్రి మంచివాడు అని అనుకోగా చాలాసార్లు విన్నాడు. అలా అందురూ తన తండ్రిని మెచ్చుకోవటం తనకు గర్వంగా వుంటుంది. అందుకే తను ఎప్పుడూ అసత్యం పలకడు, చెడు పనులు చేయడు. ఆ చిన్న మనస్సులో ఇన్ని అలోచనలు ఒక్కసారిగా చోటు చేసుకున్నాయి.

జరిగిన సంభాషణను బట్టి మరికొన్ని విషయాల్ని కూడా అర్థం చేసుకున్నాడు ఉదయ్. ఆ తప్పు చేయకూడదని గట్టిగా అంటే దుర్గాదాసు తన తండ్రిని కొడతాడు.

పోలీసులకు తెలిపితే తన తండ్రిని కూడా జైల్లో వేస్తారు. ఆ తప్పును సరిదిద్దుకోవాలంటే ఆ మొక్కల్ని తగలబెట్టాలి. ఆలోచిస్తూ చీకట్లో తండ్రిని అనుసరించాడు ఉదయ్.

ఆ తరువాత రెండు రోజులపాటు తండ్రి ముభావంగా, మౌనంగా వుండటం ఆ పసి మనస్సుని గాయపరిచింది. ఏదో ఒకటి చేసి తండ్రి మునుపటిలా నవ్వుతూ చేయాలి. ఎప్పటిలా తండ్రిచేతి గోరుముద్దల్ని తను తినాలి అంటే తప్పదు.

పరమశివానికి తమ విషయం తెలిసిపోయిందని పట్టాభి, మధుమూర్తి మరుసటిరోజే గ్రహించారు. నయనా, భయానా పరమశివం నోరు మెదపకుండా కట్టడి చేయగలిగారు.

సరిగ్గా నాలుగు రోజులకు గంజాయి కాయలనుంచి స్రవించిన పాలు నల్లటి జిగురులా తయారైంది.

రాత్రికి రాత్రి ఫ్లడ్‌లైట్ వెలుగులో పదిమంది నమ్మకమైన కూలీల్ని పెట్టి గంజాయి జిగురును పోగుచేయించి, ఆప్పటికప్పుడే మెక్కల్ని పీకి ఓచోట కుప్పలా

వేసి పెట్రోల్ పోసి తగులబెట్టించారు.

ప్రోగుచేసిన జిగురును పాలిథిన్ బ్యాగ్‌లో పార్సిల్ చేయించి మరుసటి రోజు రాత్రి సరిహద్దుల్ని దాటించి, అవతలపార్టీకి అందజేసే పథకాన్ని అతి జాగ్రత్తగా రూపొందించాడు పట్టాభి.

పరమశివం  భయంతో నోరు మెదపటం మానేసి అప్పటికి సరిగ్గా వారం రోజులు.

ఆ మరుసటి రోజు రాత్రి గంజాయి పార్సెల్స్‌ని లోడ్ చేసుకుని లారీ నేషనల్ హైవే ఎక్కింది. పది కిలోమీటర్స్ ప్రయాణించే వరకు ఎలాంటి అవరోధం ఎదురుకాలేదు.